సమస్యలుంటే సాక్షికి చెప్పండి
మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను మా ప్రతినిధి ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి
91829 05602
నంబర్‌లో సంప్రదించండి

నత్తనడకన..

మురళీనగర్ పార్కుల్లో సా..గుతున్న అభివృద్ధి పనులు
అందుబాటులోకి రాని అదనపు సౌకర్యాలు
అసంపూర్తి పనులతో సందర్శకుల అవస్థలు



వైశాఖి స్పోర్ట్స్ పార్కులో పెయింటింగ్ వేయాల్సిన కెర్బ్ వాల్స్



వైశాఖి స్పోర్ట్స్ పార్క్‌లో రంగులు వేసిన స్కేటింగ్ ట్రాక్



మురళీనగర్ వాకర్స్ పార్కులో పూర్తి కాని వాకింగ్ ట్రాక్ నిర్మాణం



వాకర్స్ పార్క్‌లో కూలిన ప్రహరీ

మురళీనగర్: మురళీనగర్‌లోని పలు పార్కుల్లో అదనపు సౌకర్యాల కల్పనకు జీవీఎంసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పనులు నత్తనడకన సాగుతున్నాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు సహకారంతో 50వ వార్డు కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్ ఆధ్వర్యంలో వైశాఖి స్పోర్ట్స్ పార్క్, వాకర్స్ పార్క్, బృందావన్ పార్కులను సుందరంగా తీర్చిదిద్ది.. సందర్శకులు, వాకర్స్‌కు అవసరమైన సౌకర్యాలు కల్పించారు. ఇటీవల జీవీఎంసీ ఆధ్వర్యంలో ఈ పార్కుల్లో చేపట్టిన పనులు ఆరు నెలలైనా పూర్తి కాలేదు. పనుల నిర్వహణకు తవ్వకాలు నిర్వహించడంతో వాకర్స్ తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.

వాకింగ్ ట్రాక్ పూర్తయ్యేదెప్పుడో..?

మురళీనగర్ వాకర్స్ పార్క్‌లో రూ.19 లక్షలతో జీవీఎంసీ చేపట్టిన మట్టి వాకింగ్ ట్రాక్ పనులు మందకొడిగా సాగుతున్నాయి. ఆరు నెలల కిందట ప్రారంభించి ఈ పనులు నేటికీ ఒక కొలిక్కి రాలేదు. విడతల వారీగా పనులు నిర్వహించడం వల్ల పూర్తి కావడం లేదు. ప్రస్తుతం నాలుగడుగుల లోతులో మట్టి తీసే పనులు మాత్రమే పూర్తయ్యాయి. వాకింగ్ ట్రాక్‌ను మట్టితోపాటు ఇసుక, రంపపు పొట్టు వంటి మెటీరియల్‌తో నింపి పూర్తి స్థాయిలో నిర్మించాల్సి ఉంది. ఇంతవరకు ఈ పనులు ప్రారంభించ లేదు. దీని వల్ల పార్కులో ప్రవేశించడానికి ఇబ్బందులు పడాల్సి వస్తోందని సందర్శకులు చెబుతున్నారు. ట్రాక్ చుట్టూ కెర్బ్ వాల్స్ నిర్మించి రంగులు వేయాల్సి ఉంది. దీన్ని తక్షణం పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు. ఈ పార్కును మరిన్ని సమస్యలు వెంటాడుతున్నాయి. దీనికి ఉత్తరం వైపు ఇరవై ఏళ్ల కిందట నిర్మించిన ప్రహరీ గోడ కూలిపోయి మూడు నెలలు కావస్తున్నా.. దీన్ని పునరుద్ధరించే చర్యలు నేటికీ తీసుకోలేదు. శిథిలాలను అలాగే వదిలేశారు. పూర్తి స్థాయిలో ప్రహరీ నిర్మాణానికి అధికారులు చర్యలు తీసుకోవాలని వాకర్స్ కోరుతున్నారు.

పెయింటింగ్ పనుల్లో నాణ్యత లోపం

వైశాఖి స్పోర్ట్స్ పార్కులో రూ.18 లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులు 90 శాతం పూర్తయ్యాయి. పాత బోరులో నీరు అడుగంటిపోవడంతో కొత్త బోరు 250 అడుగుల లోతు వరకు వేశారు. దీనికి 5స్టార్ రేటింగ్ 1హెచ్‌పీ మోటారు ఏర్పాటు చేశారు. కొత్తగా పిల్లల కోసం రోలర్ స్లైడ్, రైడర్స్, రెండు సీట్లు కలిగిన ఊయల ఏర్పాటు చేయగా.. అదనపు జిమ్ పరికరాల కల్పనలో భాగంగా హ్యాండ్ రోవర్, స్కైవాకర్ షోల్డర్ ప్రెస్, చెస్ట్ ప్రెస్ వంటి పరికరాలను అమర్చారు. ప్రహరీ గోడ బయటి వైపు మ్యూరల్ ఆర్ట్ పెయింటింగ్, లోపలి వైపు పెయింటింగ్, స్కేటింగ్ రింక్ పెయింటింగ్ పనులు పూర్తయినా.. నాణ్యత లోపించింది. పార్కులో వాకింగ్ ట్రాక్ చుట్టూ కెర్బ్ వాల్స్ పెయింటింగ్ పనులు పూర్తి చేయాల్సి ఉంది. బృందావన్ పార్కులో గతంలో మట్టితో నిర్మించిన వాకింగ్ ట్రాక్‌ను పునర్నిర్మించారు. జీవీఎంసీ అధికారులు దృష్టి సారించి పార్కుల్లో అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలని స్థానికులు, సందర్శకులు కోరుతున్నారు.

ర్యాలీకి తరలి రండి

మురళీనగర్: నగరంలో జీవీఎంసీ నిర్వహిస్తున్న కూల్చివేతలకు నిరసనగా మంగళవారం నిర్వహించనున్న శాంతియుత ర్యాలీకి ప్రజలు అత్యధిక సంఖ్యలో తరలి రావాలని 50వ వార్డు కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్ పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజు ఆధ్వర్యంలో ఉదయం 9.30 గంటలకు మహాత్మా గాంధీ విగ్రహం నుంచి జీవీఎంసీ కార్యాలయం వరకు ర్యాలీ చేస్తామన్నారు. రహదారులను ఆనుకుని ఉన్న బడ్డీలు, తోపుడు బండ్లు, చిరు వ్యాపారుల దుకాణాలను జీవీఎంసీ కూల్చివేయడం వల్ల అనేక మంది పేదలు ఉపాధి కోల్పోతున్నారన్నారు. వారి సమస్యలను పరిష్కరించేందుకు వైఎస్సార్‌సీపీ తరఫున శాంతియుత ర్యాలీ నిర్వహిస్తున్నామని చెప్పారు. ర్యాలీ అనంతరం జీవీఎంసీ కమిషనర్‌కు వినతి పత్రం అందిస్తామన్నారు. 50వ వార్డు చిరు వ్యాపారులందరూ ర్యాలీలో పాల్గొనాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ నియోజకవర్గాల సమన్వయకర్తలు, మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ ముఖ్య నాయకులు పాల్గొంటారన్నారు.

బాలల గృహాల తనిఖీ కమిటీ సభ్యుడిగా నరవ ప్రకాశరావు



అల్లిపురం: బాలల రక్షణ, సంరక్షణకు సంబంధించిన బాలల గృహాల తనిఖీ కమిటీ మెంబర్‌గా నరవ ప్రకాశరావును నియమిస్తూ జిల్లా కలెక్టరేట్ ఉత్తర్వులు జారీ చేసింది. జువైనల్ జస్టిస్ చట్టం ప్రకారం విశాఖ జిల్లాలోని ప్రభుత్వ, గుర్తింపు పొందిన బాల గృహాల పనితీరుపై తనిఖీ కమిటీకి జాయింట్ కలెక్టర్ చైర్మన్‌గా వ్యవహరిస్తారు. మూడేళ్ల కాలపరిమితి గల ఈ కమిటీ జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు బాలల గృహాలు చట్ట ప్రకారం నిబంధనలు పాటిస్తున్నాయా.. లేదా తనిఖీ చేసి నివేదికలు క్రమం తప్పకుండా ప్రభుత్వానికి అందజేస్తుంది. ఈ నెల 25న జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన కమిటీ సమావేశం జరగనుంది.

క్లుప్తంగా

ప్రత్యేక అన్నదానం



అన్నదానం ప్రారంభిస్తున్న బీజేపీ నాయకులు

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 24వ వార్డు సీతమ్మధారలోని సాయిబాబా గుడి వద్ద దేవీ శరన్నవరాత్రుల సందర్భంగా సోమవారం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమాన్ని బీజేపీ నాయకులు సునీల్ అగర్వాల్, శ్యామలదీపిక, ఆలయ ఈవో ప్రసాదరావుతో కలిసి ప్రారంభించారు. దసరా సందర్భంగా తొమ్మిది రోజుల పాటు ఇక్కడ ప్రత్యేక అన్నదానం నిర్వహిస్తున్నట్లు ఈవో తెలిపారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

యోగా గురువుకు సత్కారం



సునీల్‌కుమార్ దంపతులను సత్కరిస్తున్న వాకర్స్ క్లబ్ సభ్యులు

మురళీనగర్: మురళీనగర్ వాకర్స్ పార్కులో వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో పతంజలి యోగా ప్రథమ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యోగా గురువు సింహాద్రి సునీల్‌కుమార్, కల్పన దంపతులను ఘనంగా సత్కరించారు. వాకర్స్ సభ్యులకు యోగా శిక్షణలో ఆయన చేస్తున్న సేవలను వక్తలు కొనియాడారు. కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు ఎస్.భానుప్రకాష్, యోగా సభ్యులు, క్లబ్ ఇతర కార్యవర్గ సభ్యులు, హరిత పార్కు అధ్యక్షుడు కొండలరావు, మా వాకర్స్ క్లబ్ ప్రతినిధి చిన్నయ్య, అప్పలకొండ పాల్గొన్నారు.

ఏఎస్సార్ నగర్‌లో అంగీకార్ ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న జీవీఎంసీ అధికారులు, సిబ్బంది, ఏఎస్సార్ నగర్ వాసులు

తాటిచెట్లపాలెం: తాటిచెట్లపాలెం దరి ఏఎస్సార్ నగర్‌లోని టిడ్కో గృహ లబ్ధిదారులకు సోమవారం కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి వివరిస్తూ అంగీకార్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జీవీఎంసీ జోన్-5 అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.పుణ్యవతి మాట్లాడుతూ అర్బన్ హౌసింగ్ స్కీంలో పీఎంఏవై పథకంలో సొంత స్థలం ఉంటే.. రూ.2.50 లక్షల ఆర్థిక సాయం కేంద్ర ప్రభుత్వం అందిస్తోందని, సోలార్ విద్యుత్‌ను ప్రోత్సహించేందుకు గాను భారీ రాయితీని కూడా అందిస్తున్నట్లు తెలిపారు. సూర్యఘర్ పథకం కింద 50 శాతం నుంచి 75 శాతం వరకు ఎంతైనా యూనిట్ సామర్థ్యాన్ని బట్టి రాయితీ ఇస్తారన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ ప్రభ, విశాఖ సిటీ టెక్నికల్ టీం బిందు, దేవుడుబాబు, సీవో రమణి, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి కేరళ ఆయుర్వేద శిబిరం

డాబాగార్డెన్స్: ఆయుర్వేద పంచకర్మ విధానం ద్వారా దీర్ఘకాల రోగాలకు చికిత్స అందించేందుకు ఈ నెల 23, 24న కేరళ మెగా ఆయుర్వేద శిబిరం నిర్వహించనున్నట్లు ఔషధాలయ మేనేజర్ దినుప్ తెలిపారు. జీవీఎంసీ ప్రధాన గేట్ ఎదురుగా రాంనగర్ వైద్యరాజ్ ఔషధాలయంలో ప్రముఖ కేరళ వైద్యుడు డాక్టర్ కేఎం ఉన్నికృష్ణన్ నాయర్ 2 రోజులపాటు అందుబాటులో ఉంటారని తెలిపారు. డాక్టర్‌ను సంప్రదించాలనుకునే వారు అపాయింట్‌మెంట్ కోసం 8008000670, 9133106060లో సంప్రదించాలని సూచించారు.

భిన్నత్వంలో ఏకత్వంతో సమగ్రత సాధ్యం

మద్దిలపాలెం: భిన్నత్వంలో ఏకత్వంతో సమగ్రత సాధించవచ్చని రోటరీ క్లబ్ సభ్యులు అన్నారు. సమష్టి కృషితోనే లక్ష్యాలు సాకారమవుతాయన్నారు. రోటరీ జిల్లా 3020లో భిన్నత్వం, సమతుల్యత, అంతర్భాగం చేయుట (డీఈఐ) అనే అంశాలపై మద్దిలపాలెం సమీపంలోని కాకతీయ ఫంక్షన్ హాలులో సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ వాల్తేర్ అధ్యక్షుడు ఎ.ఎస్.టి.భాస్కర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వక్తలు ప్రసంగించారు. సర్వమత ప్రార్థనలతో ప్రారంభించి, నర్తనశాల నాట్యశాల విద్యార్థులు భారతదేశంలోని 9 రకాల నృత్యాలతో ఆహుతులను అలరించారు. రోటరాక్టర్స్ విద్యార్థులు వివిధ వృత్తులు ప్రదర్శించారు.

పేదల పొట్ట కొడుతున్న కూటమి ప్రభుత్వం

మాజీ సీఎం వైఎస్ జగన్‌ది ప్రజా పాలన: బాణాల శ్రీనివాసరావు



డాబాగార్డెన్స్: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ఏ రోజు కూడా పేదల పొట్టలు కొట్టలేదని జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జీవీఎంసీలో ఇంత పెద్ద ఎత్తున విధ్వంసం జరగడం కూటమి ప్రభుత్వానికే చెందిందని, కార్పొరేటర్లు ఎవరూ లేని సమయంలో ఈ తరహాలో బీభత్సం సృష్టించడం తగదన్నారు. ఉద్యోగాల్లేకపోయినా ఏదోలా బతుకుతుంటే.. కూటమి ప్రభుత్వం ఇంతగా విధ్వంసం చేయడం పేద ప్రజల పొట్టలు కొట్టడమేనన్నారు. ఇప్పటికే పార్టీ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజు బాధితులకు బాసటగా నిలిచేందుకు కార్యాచరణ రూపొందించారని చెప్పారు. వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లందరూ అధ్యయన యాత్ర ముగించుకుని విశాఖ వచ్చిన వెంటనే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని ‘సాక్షి’కి బాణాల తెలిపారు. వైఎస్ జగన్ ప్రభుత్వంలో పేదలందరూ సంతోషంగా ఉండేవారని, కూటమి అధికారంలోకి వచ్చాక పేదలు నిద్రలేని రాత్రులు గడుపుతున్నారన్నారు. ఓటేసి గెలిపించిన బడుగులకు కూటమి సర్కారు ఇచ్చిన బహుమతి ఇదేనా..? అని బాణాల ప్రశ్నించారు. పేదలు, బడుగు బలహీన వర్గాలకు వైఎస్సార్‌సీపీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, ముఖ్యంగా బడ్డీలు, దుకాణాలు పోగొట్టుకున్న బాధితులకు బాసటగా నిలుస్తామని భరోసా ఇచ్చారు.

ప్రతి యూపీహెచ్‌సీలో వైద్య పరీక్షలు జరగాలి



క్రాంతినగర్ యూపీహెచ్‌సీలో వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

మహారాణిపేట: ప్రతి పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(యూపీహెచ్‌సీ)లో అక్టోబర్ 2 వరకు వైద్య శిబిరాలు నిర్వహించి, రోగులకు అన్ని వైద్య పరీక్షలు చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి(డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు ఆదేశించారు. క్రాంతినగర్, సిద్దేశ్వరం, పురుషోత్తపురం ఆరోగ్య కేంద్రాలను సోమవారం ఆయన సందర్శించి వైద్య సిబ్బందికి పలు సూచనలిచ్చారు. క్యాన్సర్, ఇతర ఆరోగ్య పరీక్షలు చేయడంలో ఎవరు నిర్లక్ష్యం చూపవద్దని, పరీక్షలు చేయకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మాతా, శిశు సేవలను కూడా చేయాలన్నారు. వైద్య శిబిరాల్లో అభ ఐడీ గుర్తించాలని, గర్భిణుల పేర్లు నమోదు చేయాలని, సమయపాలన పాటించాలని సిబ్బందికి సూచించారు. ఆరోగ్య కేంద్రాల వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.


దివ్యాంగుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలి



జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమం ప్రారంభిస్తున్న ఏయూ రెక్టార్ ఆచార్య కిషోర్‌బాబు

మద్దిలపాలెం: సమ్మిళితం చేస్తూ దివ్యాంగ చిన్నారులను సాధికారత దిశగా నడిపించాలని ఆంధ్ర విశ్వవిద్యాలయం రెక్టార్ ఆచార్య ఎస్.కిషోర్‌బాబు అన్నారు. ఏయూ ఇంజినీరింగ్ కళాశాలలోని గౌతమ్ బుద్ధ డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ ఆడిటోరియంలో సోమవారం నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ది ఎంపవర్‌మెంట్ ఆఫ్ ది పర్సన్స్ విత్ ఇంటలెక్చువల్ డిజెబిలిటీస్, విద్యా విభాగం సంయుక్తంగా పర్పుల్ ఫెయిర్ కార్యక్రమం నిర్వహించాయి. ఈ సందర్భంగా ఆచార్య కిషోర్ బాబు మాట్లాడుతూ దివ్యాంగుల్లో ఉన్న ప్రత్యేక నైపుణ్యాలను గుర్తించి ప్రోత్సహించాలని సూచించారు. దివ్యాంగుల్లోని నైపుణ్యాలు, సృజనాత్మకత ప్రదర్శించే వేదికగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించడంపై సంతోషం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ సామాజిక న్యాయ, సాధికారత మంత్రిత్వ శాఖ డైరెక్టర్ వినీత సింఘాల్ మాట్లాడుతూ జాతీయ విద్యా విధానం – 2020లో భాగంగా విద్యలో అందరినీ భాగం చేయడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. శతాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తున్న శుభ సమయంలో ఇటువంటి కార్యక్రమానికి ఏయూ తోడ్పాటు అందించడం సంతోషకరమన్నారు. విద్యావిభాగాధిపతి ఆచార్య టి.షారోన్‌రాజు మాట్లాడుతూ తమ సామర్థ్యం, నైపుణ్యాలు ప్రదర్శించడానికి దివ్యాంగులకు ఈ వేదిక ఎంతో ఉపయోగకరంగా నిలిచిందన్నారు. భవిష్యత్‌లో దివ్యాంగుల జీవితాలు ప్రకాశవంతంగా ఉండాలన్నారు. అనంతరం ఎన్ఐఈపీఐడీ డైరెక్టర్ డాక్టర్ బి.వి.రామ్ కుమార్, సర్వశిక్ష అభియాన్ అసిస్టెంట్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ డాక్టర్ జె.చంద్రశేఖరరావు ప్రసంగించారు. కార్యక్రమంలో భాగంగా దివ్యాంగ చిన్నారులు తయారు చేసిన వస్తువులతో ఏర్పాటు చేసిన స్టాల్స్ ఆకట్టుకున్నాయి. అనంతరం వారు ప్రదర్శించిన దశావతార నృత్యరూపకం ఆకట్టుకుంది.

మహిళా కళాశాలలో గ్రీన్ ఆంధ్రప్రదేశ్



కళాశాల ప్రాంగణంలో గ్రీన్ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమం నిర్వహిస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు

డాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో సోమవారం కళాశాల స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కమిటీ ఆధ్వర్యంలో గ్రీన్ ఆంధ్రప్రదేశ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్.మంజుల మాట్లాడుతూ ప్రకృతే మానవాళి భవిష్యత్ అన్నారు. అందరూ ఒక్కో మొక్క నాటితే భవిష్యత్ తరాలకు పచ్చని ఆంధ్రప్రదేశ్ అందించగలుగుతామన్నారు. పర్యావరణ పరిరక్షణ కేవలం వ్యక్తిగత బాధ్యత కాదని, దేశం కోసం సామూహిక బాధ్యతగా భావించాలని సూచించారు. అనంతరం విద్యార్థులు, అధ్యాపకులు చురుగ్గా పాల్గొని కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. పలువురు కళాశాల ప్రాంగణాన్ని శుభ్రం చేశారు. కార్యక్రమంలో స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కన్వీనర్ ఎస్.నిర్మలాకుమారి తదితరులు పాల్గొన్నారు.

నమో దుర్గామాత



లలితా పీఠంలో మహాలక్ష్మి అలంకరణలో పద్మావతి అమ్మవారు



శాంతి స్వరూపిణి ఆలయంలో బాలా త్రిపురసుందరి



కనకమ్మ వారి వీధిలో కనకమాంబ యూత్ ప్రతిష్టించిన దుర్గాదేవి



సీతన్న గార్డెన్స్‌లో బాలా త్రిపుర సుందరిగా అమ్మవారు



మర్రిపాలెంలో స్వర్ణ కవచ లలితా త్రిపురసుందరి



మధుసూదన్‌నగర్‌లో బాలా త్రిపుర సుందరిగా దుర్గాదేవి

- అంగరంగ వైభవంగా దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం
- ఆలయాలు, మండపాల్లో విశేష పూజలు



మురళీనగర్‌లో బాలా త్రిపురసుందరిగా లలితాదేవి



సీతంపేటలో రాధాకృష్ణ రాకింగ్ యూత్ ఆధ్వర్యంలో ప్రారంభమైన దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు



తాటిచెట్లపాలెంలో ఉత్సవాలు ప్రారంభిస్తున్న లక్ష్మీనారాయణ సేవా సంఘం సభ్యులు



బాపూజీనగర్‌లో భవానీ భక్తులకు మాలలు వేస్తున్న అర్చకుడు సూర్యప్రకాశ్ శర్మ

సీతంపేట: దుర్గాదేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు నియోజకవర్గంలో సోమవారం అంగరంగ వైభవంగా మొదలయ్యాయి. అమ్మవారి ఆలయాలు, వాడవాడలా ఏర్పాటు చేసిన మండపాల్లో విగ్రహ ప్రతిష్ట, కలశస్థాపన, గణపతి పూజ చేసి దసరా ఉత్సవాలను ప్రారంభించారు.

➡ అక్కయ్యపాలెం లలితానగర్‌లోని శ్రీలలితా పీఠంలో అమ్మవారికి ఉదయం 4 గంటలకు పంచామృతాభిషేకం, అర్చన, బాలభోగ నివేదన చేశారు. పీఠం దర్బారు హాల్లో లలితా, కామేశ్వరుల విగ్రహాలను ప్రతిష్ఠించి, కలశ స్థాపన, మండప ఆవాహన, అంకురార్పణ చేసి ఉత్సవాలు ప్రారంభించారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ. సాయంత్రం శత చండీ పారాయణ, గోపూజ, శ్రీచక్రనవావరణ, మణిద్వీపంలో లలితా సహస్రనామ, కుంకుమార్చనలు నిర్వహించారు. పీఠంలో కొలువైన పద్మావతి అమ్మవారు మహాలక్ష్మి దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. మంగళవారం ఉదయం 10 గంటలకు సుబ్రహ్మణ్య స్వామి, సర్పసూక్త హోమం, మన్యుపాశుపత హోమం జరుగుతాయని, పద్మావతి అమ్మవారు ఆదిలక్ష్మి అలంకరణలో దర్శనమిస్తారని పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు.

➡ పాత రేసపువానిపాలెం స్వర్ణభారతి స్టేడియం పక్కన గల శాంతి స్వరూపిణి దుర్గాదేవి ఆలయంలో ఉదయం 6 గంటలకు గణపతి పూజ, కలశపూజ, పంచామృతాభిషేకం, దీక్షాధారణ, లక్ష్మీ అష్టోత్తర కనకధార పూజ, కుంకుమార్చన, శాంతిహోమంతో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. తొలిరోజు అమ్మవారు బాలా త్రిపురసుందరీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. మంగళవారం గాయత్రి దేవి అలంకరణలో దర్శనమిస్తారని ఆలయ కమిటీ తెలిపింది.

➡ సీతంపేటలోని రాధాకృష్ణ ఆలయం వద్ద రాధాకృష్ణ యూత్ ఆధ్వర్యంలో విగ్రహ ప్రతిష్ఠ, కలశస్థాపన, అమ్మవారికి కుంకుమ పూజలు చేసి ఉత్సవాలు ప్రారంభించారు.

➡ సీతంపేట కనకమ్మ వారి వీధిలో శ్రీకనకమాంబ యూత్ ఆధ్వర్యంలో దుర్గాదేవి విగ్రహాన్ని ప్రతిష్ఠించి పూజలు చేశారు.

బాలా త్రిపురసుందరిగా దుర్గమ్మ

మర్రిపాలెం: జీవీఎంసీ 51వ వార్డు మాధవధార సీతన్న గార్డెన్స్‌లో కొలువైన శ్రీ కనకమహాలక్ష్మి, గాయత్రిదేవి, కనకదుర్గా ఆలయంలో తొలి రోజు అమ్మవారు బాలా త్రిపుర సుందరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. వేకువజాము నుంచి ప్రత్యేక పూజలు చేశారు. పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. వారికి ఆలయ కమిటీ సభ్యులు తీర్థప్రసాదాలు అందజేశారు.

➡ 53వ వార్డు మర్రిపాలెం జాతీయ రహదారిని ఆనుకుని పంజాబ్ హోటల్ జంక్షన్ సాయినగర్‌లోని కాశీ విశ్వేశ్వర సమేత ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో కొలువైన లలితా దేవి స్వర్ణకవచ లలితా త్రిపుర సుందరిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు, భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

లలితాదేవికి సహస్ర కుంకుమార్చన

మురళీనగర్: మురళీనగర్ రామాలయంలో వెలసిన లలితాదేవి ఆలయంలో అమ్మవారికి మహిళా భక్తుల ఆధ్వర్యంలో సహస్ర కుంకుమార్చన నిర్వహించారు. తొలి రోజు అమ్మవారు బాలా త్రిపురసుందరీ దేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ నిర్వహణ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు టీఎస్ రెడ్డి, ఎస్.వరప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

భవానీ భక్తుల మాలధారణ

కంచరపాలెం: జీవీఎంసీ 54వ వార్డు 104 ఏరియా బాపూజీనగర్‌లోని జైసంతోషిమాత ఆలయంలో అమ్మవారిని బాలత్రిపుర సుందరీ దేవిగా అలంకరించారు. ఉత్సవాల సందర్భంగా భవానీ భక్తులు మాలలు ధరించారు. ఆలయ అనువంశిక ధర్మకర్త ఎడ్ల శ్రీనివాసరావు, లక్ష్మి దంపతులు కలశ ప్రతిష్ట చేశారు. ప్రధాన అర్చకుడు సూర్యప్రకాష్ శర్మ నేతృత్వంలో బాలత్రిపుర సుందరికి భక్తులు కుంకుమ పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఎర్నిమాంబకు విశేష పూజలు

జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం ఎర్నిమాంబ ఆలయంలో దేవదాయ శాఖ కార్యానిర్వహణాధికారి డి.వి.ఎస్.సురేష్‌బాబా ఆధ్వర్యంలో దేవీ శరన్నవ రాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభించారు. పలువురు నాయకులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకుడు శ్రీకాంతశర్మ అమ్మవారికి కుంకుమ పూజలు జరిపారు. సాయంత్రం నవ చండీ యాగం నిర్వహించారు, దుర్గాదేవిని ప్రత్యేక పూలతో బాలా త్రిపురసుందరి దేవిగా అలంకరించారు. వాసుపల్లి విజయమ్మ, రామకృష్ణ, ప్రసాద్, ఉత్సవ కమిటీ సభ్యులు, ఆలయ సిబ్బంది ఏర్పాట్లు పర్యవేక్షించారు.

➡ 47వ వార్డు కంచరపాలెం మధుసూదన్‌నగర్‌లోని లక్ష్మీగణపతి సహిత కనకదుర్గాదేవి ఆలయంలో అమ్మవారిని బాల లలితా త్రిపుర సుందరీ దేవిగా అలంకరించారు. ఆలయ అర్చకులు శ్రీనివాస్ శర్మ, పరమానందరావులు కుంకుమ పూజలు చేశారు. భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు ప్రసాదం అందించారు.



బాలా త్రిపురసుందరిగా ఎర్నిమాంబ అమ్మవారు

13 రోజుల పాటు ఉత్సవాలు

తాటిచెట్లపాలెం: తాటిచెట్లపాలెంలో శ్రీలక్ష్మీనారాయణ సేవా సంఘం ఆధ్వర్యంలో దేవీ నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. అక్టోబర్ 4 వరకు 13 రోజుల పాటు ఉత్సవాలు, కోలాటం, భజన వంటి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ నెల 27న భారీ అన్నదానం, అక్టోబర్ 4న అనుపు కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
వైజాగ్ నార్త్
9010810033
Office mail : sakshiadvtvsp@gmail.com